ప్రజాశక్తి

ఆదివారం 21 ఏప్రిల్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉత్సాహంగా జగ్గునాయుడు నామినేషన్

- భారీగా కదిలొచ్చిన సిపిఎం కార్యకర్తలు
- ఎర్రబారిన గాజువాక
- ఉక్కు పరిరక్షణ, గాజువాక అభివృద్ధి సిపిఎం గెలుపుతోనే సాధ్యమన్న ఇండియా వేదిక నాయకులు

వార్త సెంటర్ స్ప్రెడ్‌లో..

గాజువాకలో సాగుతున్న భారీ ర్యాలీ

రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు

జగన్‌కు పట్టని ప్రజా సమస్యలు

నర్సింగబిల్లి సభలో వైసిపి గొప్పలకే పరిమితం

ప్రస్తావించని సుగర్ ఫ్యాక్టరీ, సుజల స్రవంతి అంశాలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఎన్నికల సమయంలోనూ జిల్లాలోని అతి ముఖ్యమైన సమస్యలపై ప్రధాన రాజకీయ పార్టీలు ప్రస్తావించడంలేదు. శనివారం జిల్లాలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర సభ నర్సింగబిల్లిలో జరగ్గా అదీ వైసిపి గొప్పలకే పరిమితమైంది. ఈ సభలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను జగన్ వివరిస్తూ.. ఆ పథకాలు కొనసాగాలంటే తమ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు తప్ప జిల్లా అభివృద్ధికి తమ ప్రభుత్వం ఇవ్వబోయే ప్రాధాన్యతను చెప్పలేదు. కొద్ది రోజుల క్రితం కూటమి అభ్యర్థుల తరపున ప్రచారానికి వచ్చిన టిడిపి, జనసేన అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ వ్యక్తిగత విమర్శలకు తప్ప సమస్యల జోలికిపోలేదు. ఈసారి జగన్ కూడా అదే చేశారు. వ్యవసాయాధారిత గ్రామీణ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 3.20 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం లభించే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ పూర్తి చేయాలన్న ఆలోచన ఆ పార్టీల్లో కనిపించలేదు. జరిగిన నిర్లక్ష్యం గుర్తెరిగి, ఇకపై ఆ నిర్లక్ష్యం లేకుండా నిధుల విడుదల చేసి కాలపరిమితిలో పూర్తిచేస్తామని హామీ ఇవ్వలేదు. అభ్యర్థులెవరూ తమ ప్రాంత సమస్యలు పరిష్కారంపై మాట్లాడ్డంలేదు. ఏటికొప్పాక, తాండవ, తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణపై చెరకు రైతులకు భరోసా ఇవ్వలేదు. కాలుష్య రహిత పరిశ్రమలకు ప్రోత్సాహం, మిగతా 2లో..

నర్సింగబిల్లి సభలో మాట్లాడుతున్న జగన్

ఎన్నికల వ్యయాలను కచ్చితంగా లెక్కించాలి

వార్త 2లో..

జనసేనకు 'మూగి' రాజీనామా

వార్త 2లో..

గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వార్త మెయిన్‌లో..

పాడేరు పట్టణంలో కురుస్తున్న వర్షం

వర్షంతో ఉపశమనం

ఏజెన్సీలో చల్లనిగాలులు

వార్త 2లో..

అసెంబ్లీ స్థానాలకు 19 నామినేషన్లు

మూడో రోజు మందకొడిగా సాగిన వైనం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, అనకాపల్లి ప్రతినిధి

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని అసెంబ్లీ స్థానాలకు సంబంధించి మూడో రోజైన శనివారం 19 నామినేషన్లు దాఖలయ్యాయి. విశాఖలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మూడో రోజు శనివారం 14 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సమర్పించారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో ప్రజా ప్రస్థానం పార్టీ నుంచి తోట వెంకట సాయి ముకుంద్ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ కార్యాలయంలో ఒక సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. దక్షిణ నియోజకవర్గంలో భారతీయ రాష్ట్రీయ దళ్ పార్టీ నుంచి గుంటు దుర్గాప్రసాద్ ఒక సెట్, వైసిపి నుంచి వాసుపల్లి గణేష్ కుమార్ మూడు సెట్లు, స్వతంత్ర అభ్యర్థి జె.బిపిన్ కుమార్ జైన్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఉత్తర నియోజకవర్గ పరిధిలో నవ భారత నిర్మాణ సేవా పార్టీ నుంచి చింతాడ సూర్యం రెండు సెట్లు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి గొంప త్రివేణి, గొంప గోవింద రాజు ఒక్కో సెట్, సమాజ్ వాదీ పార్టీ నుంచి గుంపుల శరత్ బాబు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. పశ్చిమంలో బహుజన్ సమాజ్ పార్టీ నుంచి అతుకంశెట్టి రామచంద్రరావు రెండు సెట్లు, సిపిఐ నుంచి అత్తిలి విమల మూడు సెట్లు, జనవాహిని పార్టీ తరఫున చోడవరపు శంకర్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.

గాజువాక నియోజకవర్గంలో ప్రజాశాంతి పార్టీ నుంచి కిలారి ఆనంద్ పాల్ ఒక సెట్, సిపిఐ (ఎం) నుంచి మరడాన జగ్గునాయుడు రెండు సెట్లు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. పెందుర్తి నియోజకవర్గ పరిధిలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి భగత్ పిరిడి రెండు సెట్లు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. భీమిలి నియోజకవర్గ పరిధిలో శనివారం ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. ఇక విశాఖ పార్లమెంట్ విషయానికొస్తే మూడో రోజు ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి.

సమాజ్‌వాదీ పార్టీ తరఫున జాలాది విజయ కుమారి, ప్రజాప్రస్థానం పార్టీ నుంచి తోట వెంకట సాయి ముకుంద్ తమ నామినేషన్ పత్రాలను జిల్లా ఎన్నికల అధికారికి అందించారు. కాగా ఇదివరకే నామినేషన్లు వేసిన పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి పొలమరశెట్టి సత్యవతి, నవ భారత నిర్మాణ సేవా పార్టీ నుంచి చింతాడ సూర్యం, స్వతంత్ర అభ్యర్థి వడ్డి హరి గణేష్ శనివారం మరొకసారి రెండో సెట్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అసెంబ్లీ స్థానాలకు 19 నామినేషన్లు

నామినేషన్ పత్రాలు సమర్పించారు.

అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి లోక్‌సభ స్థానానికి ఆడారి శరశ్చంద్ర (జై భారత్ పార్టీ) శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థులుగా చోడవరం నుంచి సూర్య నాగ సన్యాసిరాజు కలిదిండి (తెలుగుదేశం), మాడుగుల నుంచి తాళ్ల రవి (నవ భారత్ నిర్మాణ సేవా పార్టీ), అనకాపల్లి నుండి ఆళ్ల సత్తిరాజు (ఇండిపెండెంట్), యలమంచిలి నుండి బొర్రా అమ్మాజమ్మ (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), సుందరపు ఈశ్వరరావు (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్) తరపున నామినేషన్లు దాఖలు చేశారు. పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాల్లో నామినేషన్లు పడలేదు.

జగన్‌కు పట్టని ప్రజా సమస్యలు

స్థానిక యువతకు ఉపాధి అంశం వీరి మదిలో ఉన్నట్లు లేదు. మరుగున పడ్డ ప్రధానాంశాలపై జగన్ ఎటువంటి హామీ ఇవ్వలేదు.

జగన్ సభకే బస్సులన్నీ తరలింపు.. ఇబ్బందుల్లో జనం

జగన్ సభకే బస్సులన్నింటినీ తరలించేయడంతో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గాజువాక, కూర్మన్నపాలెం వంటిచోట్ల బస్‌స్టాప్‌ల్లో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు కనిపించారు. అరగంటకో, గంటకో వచ్చిన బస్సు కూడా రద్దీగా ఉండటంతో వృద్ధులు, మహిళలు, వికలాంగులు ఎక్కలేకపోయారు. అసలే తీవ్రంగా ఎండ ఉండటంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'సిఎం వస్తే.. బస్సులన్నీ తీసేస్తారా.. ఇలా అయితే ప్రజలు ఏం కావాలి' అంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

షాపింగ్ మాల్‌లో సినీ నటి శివాత్మిక

ఎస్ఆర్ షాపింగ్‌మాల్ పున: ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : జగదాంబ జంక్షన్‌లో ఆధునికీకరించిన ఎస్ఆర్ షాపింగ్‌మాల్‌ను సినీహీరోయిన్ శివాత్మిక రాజశేఖర్ జ్యోతి ప్రజ్వళన చేసి శనివారం పున్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ రావడం ఆనందంగా ఉందన్నారు. ఇరవై ఏళ్లు వస్త్రవ్యాపారంలో అనుభవమున్న ఎస్ఆర్ షాపింగ్‌మాల్‌లో కొత్త కలెక్షన్స్‌ను ఆకర్షనీయమైన ఆఫర్లతో సరసమైన ధరలకు అందిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంస్థ డైరెక్టర్ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లో తమకు 14 బ్రాంచిలు ఉన్నాయని, జగదాంబ, గాజువాక, అనకాపల్లిలోని మాల్స్‌ను ఆధునికీకరించి, 'ఇప్పటి వరకు ఒక లెక్క, ఇక నుంచి మరో లెక్క' ట్యాగ్‌లైన్‌తో ముందుకు వెళ్తున్నారు. ప్రత్యేక ఆఫర్లు, ఛాలెంజింగ్ ధరలు మరో వారం రోజుల పాటు అమలులో వుంటాయన్నారు కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ రఘు, బ్రాంచ్ మేనేజర్ గోవిందరెడ్డి పాల్గొన్నారు.

అట్టహాసంగా 'వాసుపల్లి' నామినేషన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైసిపి దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం దాఖలు చేశారు. ముందుగా కనకమాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని, పూజలు నిర్వహించి, అక్కడే నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం వైసిపి శ్రేణులు, అభిమానులతో భారీ ర్యాలీగా టర్నర్ చౌల్ట్రీలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలను ఆర్‌ఒకు అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణా మార్కెట్ దుర్గాలమ్మ గుడి వద్ద ర్యాలీని ఉద్దేశించి, వైసిపి విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో స్థానికులమైన తమను ఎంపి, ఎమ్మెల్యేలుగా గెలిపించాలని కోరారు. విశాఖను పరిపాలనా రాజధాని చేయాలన్న జగన్‌కు విశాఖ ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైసిపి జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు,`క్షిణ పరిశీలకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ్, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ పాల్గొన్నారు.

వైసిపి హయాంలో ముస్లిములకు ప్రాధాన్యత

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రాష్ట్రంలోని ముస్లిములంతా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని ముస్లిం మైనారిటీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు డాక్టర్ జహీర్‌అహ్మద్ అన్నారు. శనివారం వైసిపి ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించి రాష్ట్రంలో ముస్లిముల అభివృద్ధికి వైఎస్ఆర్ దోహదపడితే, దాన్ని ఆయన తనయుడు జగన్మోహనరెడ్డి కొనసాగిస్తున్నా, ముస్లిముల సంక్షేమానికి రూ.23,175కోట్లు వెచ్చించారన్నారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ధరిత్రి దినోత్సవాన్ని జయప్రదం చేయాలని గ్రీన్ క్లైమేట్ స్వచ్ఛందసంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం కోరారు. శనివారం ఎంవిపి కాలనీలోని ఎస్‌విఐపి డిగ్రీ కళాశాలలో, శివాజీపాలెం జివిఎంసి ప్రాదమిక పాఠశాల, కెడిపిఎం ఉన్నత పాఠశాలల్లో ఎపి కాలుష్య నియంత్రణ మండలి, గ్రీన్ క్లైమేట్ సంయుక్త ఆధ్వర్యాన ధరిత్రి దినోత్సవం నిర్వహించారు.

స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించేవారినే గెలిపించుకుంటాం

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించేవారినే ఎన్నికల్లో గెలిపించుకుంటామని సిఐటియు నాయకులు బి.అప్పారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1164వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎస్ఎంఎస్ విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం చిత్తశుద్ధితో పోరాటం చేస్తున్నవి వామపక్ష పార్టీలు మాత్రమేనన్నారు. కార్మికుల కోసం, కార్మికుల ఆర్థిక ప్రయోజనాల కోసం నిరంతరం పోరాడే పార్టీలను గెలిపించుకోవడం వల్ల కార్మిక హక్కులను కాపాడుకోగలిగినవారిమి అవుతామన్నారు. సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడును గెలిపిస్తే కార్మికవర్గానికి మేలు జరుగుతుందన్నారు. కేంద్రం ఉక్కు ప్రైవేటీకరణ చర్యలను విడనాడకుంటే రానున్న కాలంలో తగిన బుద్ధి చెబుతామన్నారు. తక్షణం బొగ్గు కొరత సమస్యను స్టీల్ యాజమాన్యం పరిష్కరించాలన్నారు.

వర్షంతో ఉపశమనం

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శనివారం భారీ వర్షం కురిసింది. గంటకు పైగా ఉరుములు గాలులతో భారీ వర్షం పడింది. ఇటీవల కొద్ది రోజులుగా మన్యంలో ఉష్ణోగ్రతల పెరిగి ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. పాడేరులో గత పది రోజులుగా ఎండ తీవ్రత బాగా పెరిగింది. ఈ సమయంలో భారీ వర్షం కురవడంతో పాడేరు మన్యమంతా ఆహ్లాద భరితంగా మారింది. మన్యంవాసులకు వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగింది. వేసవిలో ఏప్రిల్, మే నెలలో మధ్యాహ్నం పూట పాడేరు ఏజెన్సీలో ఈదురు కాలులతో కూడిన భారీ వర్షాలు కురవడం పరిపాటి. ఏజెన్సీ అంతటా ఈ వేసవి వర్షాలు అక్కడక్కడ కురుస్తున్నాయి. వేసవి దుక్కులకు ఈ వర్షాలు ఉపకరిస్తాయని రైతులు చెబుతున్నారు.

జి:మాడుగుల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. శనివారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా కాసింది. ఎండ వేడిమికి మండల వాసులు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. మధ్యాహ్న సమయంలో భారీ వర్షం కురవడంతో ఎండ నుండి ప్రజలు ఉపశమనం పొందారు.

అనంతగిరి:మండలంలో ఒక్కసారిగా ఆశాశం మేఘావృతమై మెరుపులు, ఈదురు కాగాలతో కూడిన కుండ పోత వర్షం కురవడంతో మండలమంతా ఉపశమనం పొందారు. గత రెండు నెలలుగా ఎండతో పాటు వడగల్పులతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలు సుమారు రెండు గంటల సేపు ఏకదాటిగా కుండ పోత వాన కురవడతో సేద తీరారు.

జనసేనకు 'మూగి' రాజీనామా

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గ జనసేన నేత, మత్స్యకార వికాస విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ మూగి శ్రీనివాసరావు జనసేన పార్టీకి రాజీనామా చేస్తున్నానని వెల్లడించారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఎన్నో ఒడిదుడుకుల మధ్య దక్షిణంలో జనసేన పార్టీని గాడీలో పెడితే, స్థానికుడిని కాదని, వేరే నియోజకవర్గానికి చెంది, 24కేసులున్న వంశీకృష్ణకు టిక్కెట్ ఇచ్చారన్నారు. అదీ పవన్‌ను ప్యాకేజీ స్టార్ అంటూ దూషించిన వ్యక్తికి ఇవ్వడం మరీ దారుణమని సంబంధిత వీడియోను చూపారు. రబ్బర్ చెప్పులు వేసుకున్న వారికే రాజ్యాధికారమని ప్రకటించిన పవన్‌కల్యాణ్, అటువంటి వారిలో ఒక్కరికైనా టికెట్ ఇవ్వలేదని, పొత్తులో దక్కిన 21స్థానంల్లో పది కాపులకు, 12ఒసిలకు, రెండు బిసిలకు ఇచ్చారన్నారు మత్స్యకారులు, దళితులు ఎక్కువగా ఉన్న దక్షిణం టిక్కెట్ కేటాయింపులో పవన్‌కల్యాణ్ సామాజిక న్యాయాన్ని గాలికొదిలేశారని ఆరోపించారు. ఆత్మగౌరవం ఉన్నవారెవరూ జనసేనలో ఇమడలేరని, అందుకే బయటకొచ్చేశారని, త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నారు.

ఎన్నికల వ్యయాలను కచ్చితంగా లెక్కించాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థుల వ్యయాల వివరాలను కచ్చితత్వంతో లెక్కించాలని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు రెంగ రాజన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో విశాఖ పార్లమెంట్ పరిధిలోని తూర్పు, దక్షిణం, భీమిలి అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు సౌమ్య పాండే జైన్, ఉత్తరం, పశ్చిమ, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు ఆక్తా జైన్‌లతోకలిసి సమీక్షించారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల వ్యయాల లెక్కింపుపై అసెంబ్లీ నియోజకవర్గాల సహాయ వ్యయ పరిశీలకులు (ఎఇఒ)లకు తగు సూచనలు చేశారు.

మాట్లాడుతున్న రెంగ రాజన్

ఈ సందర్భంగా విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు రెంగ రాజన్, మాట్లాడుతూ పోటీ అభ్యర్థులు ఖర్చుచేసే ప్రతి పైసా ఎన్నికల వ్యయంలోకే వస్తుందని, అందువలన వాటిపై ఎఇఒలకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల వ్యయం లెక్కింపులో పనిచేసే బృందాల నుంచి ఎప్పటికపుడు వివరాలు సేకరించాలని, వాటిని సంబంధిత పట్టికల ద్వారా ఎన్నికల వ్యయ రిజిష్టరులో నమోదు చేయాలని సూచించారు. పెయిడ్ న్యూస్‌కు సంబంధించిన వ్యయ వివరాలను బి-16 ద్వారా ఎంసిఎంసి తెలియజేస్తుందన్నారు.వాటిని కూడా ఎన్నికల వ్యయంలోకి లెక్కించాల్సి ఉంటుందని సూచించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని, అనుమతి లేకుండా చేసే వాటిని కూడా పరిశీలించి ఎన్నికల వ్యయంలోకి తీసుకోవాలని ఆదేశించారు. ఒకసారి వినియోగించిన సామగ్రినే మళ్లీ వినియోగిస్తే, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి వ్యయ రిజిష్టరులో నమోదు చేయాలని స్పష్టం చేశారు. స్టార్ క్యాంపెయినర్లతో నిర్వహించే ప్రచార వ్యయాన్ని కూడా పార్టీ అభ్యర్థి ఖాతాలకు సమానంగా చూపాలని తెలిపారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఉమ్మడి ప్రచారంలో పాల్గొనే అభ్యర్థుల వ్యయాలను కూడా సమానంగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో అభ్యర్థుల వ్యయాల లెక్కింపు వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత రిజిష్టర్లలో ఎప్పటికపుడు నమోదు చేసి, ఆయా వ్యయ పరిశీలకులకు అందజేయాలని సూచించారు. ఈసందర్భంగా పలువురు ఎఇఒల సందేహాలను నివృత్తి చేశారు.

బాలల హక్కుల రక్షణకు చర్యలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఈనెల 22నుంచి ప్రారంభమయ్యే కరకచెట్టు పోలమాంబ వార్షికజాతరలో భాగంగా 23న ప్రధానపండుగలో తల్లిదండ్రులతో కలిసి పెద్దసంఖ్యలో పిల్లలు పాల్గొనే అవకాశం ఉందని, వారి రక్షణకు తగు చర్యలు చేపట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం సూచించారు. ఈ మేరకు దేవస్థానం అధికారులకు,జిల్లా ఉన్నతాధికారులకు శనివారం ఆదేశాలు జారీచేశారు. క్యూలైన్లు, చంటి పిల్లలకు పాలు పెట్టేందుకు ప్రత్యేక క్యాబిన్లు, వికలాంగ బాలలకు సులభతర దర్శన ఏర్పాట్లు చేయాలని కోరారు.

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT GAJUWAKA O.S. 129/2014

Between:
P.V.Ramana Murthy
. . . Plaintiff
And:
G.Jayaram & others
. . . Defendants

NOTICE

To
The Defendant No.3:
Gudela Laxmi,
D/o late Yellaji Rao,
D.No.9-7-224/1,
Shankar Nagar,
Gajuwaka, Visakhapatnam-26.

Please take notice that the above-named plaintiff has instituted the above suit against you and other defendants for permanent injunction and other reliefs, and the same stands posted to **15-5-2024** for your appearance either in person or by a pleader on the above said date at **10.30 A.M.** to answer all material questions failing which the matter will be heard and determined in your absence exparte as per law.

POTHINA RAMBABU
Advocate,
Kailash Nagar, Gajuwaka,
Visakhapatnam.
Cell No.9848063531

తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: విశాఖ తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవివి సత్యనారాయణ అన్నారు శనివారం 94వరోజున పాదయాత్రలో భాగంగా మద్దిలపాలెం, గాయత్రి పాఠశాల, ఆర్‌టిసి డిపో ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి సత్యారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు సిఎం జగన్ ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలన్నీ పారదర్శకంగా అమలుచేశారని, పేదలు, పెత్తందారులకు జరుగుతున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించి, జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని

ఎంవివికి హారతి ఇస్తున్న మహిళలు

కోరారు. తూర్పు నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను కూడా గెలిపించాలని అభ్యర్థించారు.

ఆక్రమణలో ఫుట్‌పాత్

ఇబ్బందులుపడుతున్న పాదచారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : పాదచారుల కోసం ఎంతో అందంగా తయారుచేసిన ఫుట్‌పాత్‌లు ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురవుతున్నాయి. దీంతో పాదచారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీనిని అడ్డుకోవలసిన టౌన్‌ప్లానింగ్, సచివాలయ సిబ్బంది పట్టించుకోవడంలేదు. బిఆర్‌టిఎస్ రోడ్డు హనుమంతువాక నుంచి దీనదయాల్‌పురం వైపు వెళ్లే సర్వీసు రహదారి హనుమంతువాక, పందులపోరం, సంజయ్‌గాంధీ కాలనీ, పెదగదిలి, చినగదిలి, దీనదయాల్‌పురం ప్రాంతాల్లో పాదచారుల కోసం టైల్స్ వేసి అందమైన ఫుట్‌పాత్‌లు నిర్మించారు. ఏ ఉద్దేశంతో నిర్మించారో అది నెరవేరకుండా పోయింది. ఈ మార్గంలో చాలా వరకు ఆక్రమణలకు గురయ్యాయి. ఫుట్‌పాత్‌ల మీదే ద్విచక్రవాహనాలు, ఫోర్ వీలర్స్ పార్కింగ్ చేస్తున్నారు. వీటితో పాటు చిల్లర దుకాణాలు, వెల్డింగ్ షాపులు, టిఫిన్ షాపులు పెట్టుకొని వ్యాపారాలు సాగిస్తున్నారు. మరి కొన్ని ప్రాంతాల్లో భవన నిర్మాణ సామగ్రిని అక్కడే డంపింగ్ చేస్తున్నారు. డంపింగ్ చేసే క్రమంలో అందంగా ఎంతో వ్యయంతో తయారుచేసిన ఫుట్‌పాత్‌లను పెద్ద పెద్ద వాహనాలు ఎక్కించి ధ్వంసం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు ఫుట్‌పాత్‌లపై సురక్షితంగా నడిచేందుకు వీలుపడక రోడ్డు దిగి నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఒక్కొక్కసారి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గతంలో జివిఎంసి అధికారులు వారంలో ఒక రోజు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఇటువంటి ఆక్రమణలు గుర్తించి వెంటనే తొలగింపు చర్యలు తీసుకునేవారు. గత కొన్నేళ్లుగా ఇటువంటి చర్యలు తీసుకోకపోవడం, చూసి చూడనట్టు వదిలేయడంతో పూర్తిగా ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫుట్‌పాత్‌లు, రహదారుల ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కాలిబాటల చోట డంపింగ్ చేసిన భవన నిర్మాణ సామగ్రి, పార్కింగ్ చేసిన వాహనాలు

మూడు గ్రామాల్లో రోడ్డు షో

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండలంలోని వెంకటాపురం, రేవిడి, పాండ్రంగి గ్రామాల్లో భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ రోడ్ షోలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇటువంటి మంచి పరిపాలన సాగించిన వైసిపిని గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.రాంబాబు, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ ఎస్.గిరిబాబు, మండల వైసిపి అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు, ఎం.అప్పారావు, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య ఇటుక బట్టీలు వద్దు

ప్రజాశక్తి-ఆనందపురం : ప్రజలు నివసించే ఇళ్ల మధ్య ఇటుక బట్టీలు నిర్వహించవద్దని ఆనందపురం మండలం గొట్టిపల్లి పంచాయతీ వెంకటాపురం గ్రామస్తులు కోరుతున్నారు. వెంకటాపురం గ్రామాన్ని ఆనుకొని కొంతమంది ఇటుక బట్టీలు పెట్టుకోవడానికి భూములు ఇవ్వడాన్ని వ్యతిరేకించారు. జనావాసాలు పక్కన ఇటుక బట్టీలు ఏర్పాటుచేస్తే మట్టి, బొగ్గు కాలుష్యంతో ఇళ్లు మొత్తం దుమ్ము, ధూళితో నిండిపోతున్నాయని తెలిపారు. గతంలో ఇక్కడ ఇటుక బట్టీలు నిర్వహించడం వల్ల పలు అనారోగ్య సమస్యలకు గురయ్యామని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుతం ఇటుక బట్టీలు నిర్వహించడానికి మట్టి, బొగ్గు సమకూరుస్తుండటంపై గ్రామానికి చెందిన పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఇటుక బట్టీలు నిర్వహణ వలన పెద్దవారి కల్లాలు, ఎస్సీ కాల, కరుతువారి కల్లాలు, వెంకటాపురం కాలనీ వాసులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని చెబుతున్నారు. ఇటుక బట్టీల నిర్వహణకు అధికారులు అనుమతులు ఇవ్వరాదని కోరారు. దీనిపై పరిశీలన జరిపి ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నృత్య ప్రదర్శనలిస్తున్న విద్యార్థినులు

ఓక్రిడ్జ్‌లో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం సింగనబంద ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం సాయంత్రం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఔట్ గోయింగ్ గ్రేడ్ 12వ తరగతి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా పూర్వ విద్యార్థి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. భవిష్యత్తును ఎలా ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలో విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపల్ శైలా భమిడిపాటి మాట్లాడుతూ, విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడంలో తమ విద్యా సంస్థ ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వర్మ రాజు

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి మండలం తాళ్లవలస గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరినట్టు భీమిలి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అడ్డాల వెంకటవర్మ రాజు (హాసిని వర్మ) తెలిపారు. తాళ్లవలసలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో శనివారం పలువురికి కండువాలు వేసి కాంగ్రెస్ పార్టీలోకి ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి గాదం మహేష్, నాయకులు గౌతమ్, రజనీకాంత్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ద్వితీయ ఇంటర్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన ఆరుద్ర మయూఖ్ భాగవతులను బివికె కళాశాల ప్రిన్సిపల్ రమా ఆచంట శనివారం అభినందించారు. ఆరుద్ర మయూఖ్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం హెచ్ఇసి గ్రూపులో 929 మార్కులు సాధించి కళాశాల అన్ని గ్రూపుల్లో ప్రథముడిగా నిలిచాడని ప్రిన్సిపల్ తెలిపారు. ఐఎఎస్ అధికారి కావడమే లక్ష్యమని ఆరుద్ర మయూఖ్ తెలిపారు. పదవ తరగతి వరకు విశాఖ వ్యాలీ స్కూల్లో, ఇంటర్ బివికె కళాశాలలో చదువుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ విభాగం అధ్యాపకులు రత్నశేఖర్, భరత్, ప్రియా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గోస్తనీకి

తాటిపూడి నీరు విడుదల

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని వికె.పాలెం కృష్ణాపురం, పాండ్రంగి, మునివానిపాలెం గ్రామాలను ఆనుకొని ఉన్న గోస్తనీ నదికి ఆదివారం తాటిపూడి నుంచి నీటిని విడుదలచేశారు. దీంతో ఇంతవరకు ఎండిపోయి దర్శనమిచ్చిన గోస్తనీ నీటితో కళకళలాడుతోంది. గోస్తనీ సాగునీటి కాలువలు కూడా నీటితో నిండుగా కనిపిస్తున్నాయి. దీంతో పశువులకు అనుకూలంగా ఉందని రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. భూగర్భజలాలు పెరగడంతో వ్యవసాయ బోర్లు నుంచి కూడా విస్తారంగా నీరు వస్తోంది.

పోలమాంబ లక్ష కుంకుమార్చన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు పరిధి పెదగదిలి, సంజయ్‌గాంధీ కాలనీల్లో శ్రీపోలమాంబ అమ్మవారి పంచరాత్రి జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో మహిళలచే లక్ష కుంకుమార్చనలు చేశారు. ప్రధాన అర్చకులు ప్రతాప్ శ్రీతేజ శర్మ నేతృత్వంలో వేదమంత్రాల మధ్య నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ కోరుకొండ వెంకటరత్నం స్వాతీదాస్ అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు మహాఅన్నదాన ప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త కంచుమూర్తి నాగరాజు, అధ్యక్షులు ఒమ్మి రాజు, కార్యదర్శి క్రెరు తాతారావు, ఈశ్వరరావు, హరినాథ్, కంచుమూర్తి శ్రీనివాసరావు, అప్పలరాజు, మహేష్ తదితరులు పర్యవేక్షించారు.

46వ వార్డులో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజుకు మద్దతుగా జివిఎంసి 46వ వార్డులో డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యేగా కెకె.రాజును, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 46వ వార్డు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అఖిలగాండ్ల తెలికుల మద్దతు

రానున్న ఎన్నికల్లో వైసిపికి మద్దతు తెలియజేస్తూ అఖిల గాండ్ల తెలికుల, దేవతికుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యాన పౌర గ్రంథాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తూర్పు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి.సత్యనారాయణ, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల అభివృద్ధికి అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల గాండ్ల తెలికుల, దేవతికుల ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షులు (ఉత్తరాంధ్ర) వీరవల్లి పెద్దబాబు, కన్వీనర్ గొట్టిపల్లి వెంకటరావు, అధ్యక్షులు (సిటీ) నేరెళ్ల అప్పల నారాయణరాజు , వైసిపి లీగల్ సెల్ సభ్యులు గండేపల్లి త్రినాథరావు, కార్యనిర్వాహక అధ్యక్షులు తాళ్ల వెంకట సూర్యనారాయణ, కోశాధికారి పోలిపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరను ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

జైభారత్ నేషనల్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దుతానని జైభారత్ నేషనల్ పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వివి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ త్రీ స్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాను పర్యటిస్తున్నప్పుడు సమస్యను స్థానికులు వివరిస్తున్నట్లు చెప్పారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే వాటి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జై భారత్ నేషనల్ పార్టీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సిద్ధం బస్సుయాత్రను జయప్రదంచేయాలి

ఉత్తర వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఆదివారం విశాఖ నగర పరిధిలో ప్రవేశిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని ఉత్తర నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు కోరారు. ఈ మేరకు నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో ముఖ్యనాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆదివారం మధ్యాహ్నం 4 గంటలకు ఉత్తర నియోజకవర్గంలో యాత్ర ఉంటుందని, కంచరపాలెం, దొండపర్తి, అక్కయ్యపాలెం మహారాణి పార్లర్, సత్యం జంక్షన్ వద్ద ప్రజల నుంచి వినతి పత్రాలు సేకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కెకె.రాజు

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
ఆదివారం
21 ఏప్రిల్ 2024

కలం మాట



నీ ఆశలు సాధించుకోవోయ్..!

ప్రజాస్వామ్య దేశంలో
ప్రజాసేవ చేసే అదృష్టం
కల్పించే ఏకైన సన్మార్గం
ఎన్నికలలో పోటీ చేయడం
పోటీలో ఎందరున్నా
నీతి నిజాయితీలతో

మనవెంట నడిచే నాయకుడినే
ఎన్నుకోవడం మన గురుతర బాధ్యత
సొంత లాభం చూడకుండా
అందరి కొరకు పాటుపడే వారికి
తోడ్పాటు అందించవలెను..
మాయ మాటల వలల చిక్కక
నిక్కచ్చిగా ఉండు వాళ్లను ఎన్నుకోవోయ్
నిండుమనసుతో ఓటు వేసి
దీవించవలెనోయ్
ఊరు బాగుకు ఊతమిచ్చి
దేశసేవను దైవసేవగా భావించునట్టి
మహనీయులను గెలుపు గుర్రం
ఎక్కనీయవోయ్
ఎంత ఎదిగినా ఒదిగి ఉండు
ఉత్తములకు ఓటువేసి
ఉన్నతిని కల్పించవలెనోయ్
మంచిరోజులు మలచుకునే
శక్తియుక్తులు నీకున్నవోయ్
డబ్బులిచ్చి నిను కొంటుంటే
మందు పట్టి మతిని పోగొడుతుంటే
మౌనంగా ఎందుకు ఊరుకుంటావ్
అంగడిలో సరకు కాదుగా
ఒక్కనోటుతో ఓటువేస్తే
ప్రశ్నించే హక్కు నీకుండదోయ్
పది మందికి పాటుపడే వారికి
ఓటుతో పలకరించి
కోటలో కుర్చీ వేసి
నీ ఆశలు సాధించుకోవోయ్

– సీతా సతీష్, ఉపాధ్యాయుడు, కవి.

దేశం అభివృద్ధి చెందడమంటే,
అద్దాల మేడలు, రంగుల గోడలూ కాదు
పౌరుని నైతికాభివృద్ధే
నిజమైన దేశాభివృద్ధి
- డాక్టర్ బిఆర్.అంబేద్కర్

వైసిపి ఎన్నికల అక్రమాలను కలిసికట్టుగా ఎదుర్కోవాలి : శ్రీభరత్

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీభరత్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :వైసిపి ఎన్నికల అక్రమాలను లీగల్ సెల్ ధీటుగా ఎదుర్కోవాలని విశాఖపట్నం లోక్‌సభ టిడిపి అభ్యర్థి ఎం.శ్రీ భరత్ అన్నారు శనివారం జిల్లా టిడిపి కార్యాలయంలో కూటమి పార్టీల లీగల్ సెల్ నేతలతో సమావేశంలో మాట్లాడుతూ, విజయం కోసం అడ్డదారులు తొక్కుతున్న వైసిపి, న్యాయపరమైన చిక్కులు సృష్టిస్తుందని, వాటిని ధీటుగా ఎదుర్కోవడానికి మూడు పార్టీల లీగల్ సెల్ నాయకులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బత్తి రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో, రాష్ట్ర టిడిపి లీగల్ సెల్ అధ్యక్షుడు పి.ఎస్ నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్‌వి రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నెల ఈశ్వరరావు, సెక్రెటరీ ఎస్.సతీష్ బిజెపి నేతలు జె.పృధ్వీరాజ్, జి.కిషోర్ జనసేన నేతలు సతీష్, రేవతి డి.దుర్గాప్రసాద్, కన్నూరు అప్పలనాయుడు, ఉమాశంకర్, సనపల రమేష్ కుమార్, డి.నరేష్ కుమార్ పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న ఇండియా వేదిక నాయకులు

ఉత్సాహంగా జగ్గునాయుడు నామినేషన్

- భారీగా కదిలొచ్చిన సిపిఎం కార్యకర్తలు : ఎర్రబారిన గాజువాక
- సిపిఎం గెలుపుతోనే ఉక్కు పరిరక్షణ, గాజువాక అభివృద్ధి సాధ్యం : ఇండియా వేదిక

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/ గాజువాక
ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి మరడాన జగ్గునాయుడు నామినేషన్ కార్యక్రమం శనివారం ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. సిపిఎం, ఇండియా వేదిక నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావడంతో గాజువాక ఎర్రబారింది. ఎవరిచేతిలో చూసినా సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుతో కూడిన ఎర్రజెండాలే కానవచ్చాయి. ప్రజానాట్యమండలి కళాకారుల గీతాలు, నృత్యాలు, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాత గాజువాక జంక్షన్‌లో జరిగిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ పారిశ్రామిక ప్రాంతం, గాజువాక అభివృద్ధి చెందాలన్నా, స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలన్నా సిపిఎం, ఇండియా వేదిక పార్టీలను గెలిపించుకోవాలని గాజువాక ప్రాంత ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రజలను ఓట్లడిగే అర్హత ఇండియా వేదిక అభ్యర్థులకే ఉందని ఉద్ఘాటించారు. బిజెపి, దానికి మద్దతునిస్తున్న టిడిపి, జనసేన, వినాశకర వైసిపిలను ఓడించాలన్నారు. రూ.వేల కోట్లు ఈ ఎన్నికల్లో ఏరులై పారుతున్నాయని, ప్రధాన పార్టీలు డబ్బు రాజకీయంతో ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేస్తున్నాయని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ రక్షించబడాలంటే పార్లమెంట్‌లో తాడోపేడో తేల్చే వారుండాలని..

కోలాటమాడుతూ కదిలిన మహిళా కార్యకర్తలు

నామినేషన్ ర్యాలీలో సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు, పక్కన రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఇండియా వేదిక నేతలు

అలాంటి వ్యక్తి సత్యారెడ్డి అని, విశాఖ పార్లమెంట్‌కు కాంగ్రెస్ తరపున ఆయన బరిలో ఉన్నారని శ్రీనివాసరావు సభికులకు పరిచయం చేశారు. సుత్తి కొడవలి నక్షత్రంపై ఓటేసి జగ్గునాయుడును, హస్తం గుర్తుపై ఓటేసి సత్యారెడ్డిని గాజువాక ప్రజలు గెలిపించాలన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రాధాన్యతను వివరించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే కార్మికవర్గ కేంద్రం గాజువాక కనుమరుగైపోతుందని ఆందోళన చెందారు. గాజువాక అభివృద్ధి కోసం, రోడ్ల విస్తరణ కోసం 1980వ దశకంలో ప్రతీరోజూ రాస్తారోకోలు జరిగాయని గుర్తుచేశారు. మహిళలు ఆ పోరాటాల్లో ముందుండడంతో వంద మంది మహిళా పోలీసులను అప్పట్లోనే ప్రభుత్వం నియమించుకోవాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ శీర రమేష్ మాట్లాడుతూ ప్రతిపక్షాలను లేకుండా చేసే కుట్ర దేశంలో సాగుతోందన్నారు. సిపిఐ జివిఎంసి ఫ్లోర్ లీడర్ ఎజె.స్టాలిన్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్లకు అప్పగించాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. సిపిఎం గాజువాక నియోజకవర్గ అభ్యర్థి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ గంగవరం పోర్టు, విశాఖ డెయిరీ కాలుష్య సమస్యల పరిష్కారానికి తాను గెలిస్తే కృషి చేస్తానన్నారు. ఇప్పటికీ విద్య, వైద్యం సామాన్యులకు అందడం లేదన్నారు. గాజువాకలో 90 శాతం మంది కార్మికులు నివసిస్తున్నారని, వారి సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ విశాఖ ఎంపీ అభ్యర్థి సత్యారెడ్డి మాట్లాడుతూ త్యాగాలతో ఏర్పడ్డ విశాఖ ఉక్కును అమ్మే హక్కు కేంద్ర బిజెపికి ఎవరిచ్చారన్నారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సభకు ముందు కొత్త గాజువాక నుంచి పాత గాజువాక జంక్షన్ వరకూ భారీ ర్యాలీ సాగింది. కార్మికవర్గం ఎక్కడికక్కడ ఎదురేగి ఘన స్వాగతం పలికింది. సభ అనంతరం గాజువాక తహశీల్దార్ కార్యాలయంలో జగ్గునాయుడు నామినేషన్ వేశారు. ర్యాలీ, సభల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, తదితరులు పాల్గొన్నారు.

'పశ్చిమం' నుంచి విమల నామినేషన్

- ఇండియా ఫోరం బలపరిచిన సిపిఐ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి..
- వేదిక పార్టీల శ్రేణులతో భారీ ర్యాలీగా వెళ్లి నామపత్రం దాఖలు
- రాజ్యాంగ పరిరక్షణకు కృషి : జెవి సత్యనారాయణమూర్తి

భారీ ర్యాలీగా వెళ్తున్న ఇండియా వేదిక శ్రేణులు

ప్రజాశక్తి -గోపాలపట్నం
విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి ఇండియా ఫోరం నుంచి సిపిఐ అభ్యర్థి అత్తిలి విమల శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా పాత ఐటిఐ జంక్షన్ నుంచి కంచరపాలెం మెట్టు వరకు భారీ ప్రజా ప్రదర్శన నిర్వహించారు. డప్పులు వాయిస్తూ, డ్యాన్సులు వేస్తూ సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, పలు ప్రజా సంఘాల నాయకులు ప్రదర్శనలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇండియా ఫోరం అభ్యర్థుల గెలుపు ఆవశ్యకతను వివరిస్తూ ప్రదర్శన సాగింది.

అనంతరం నిర్వహించిన సభలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, దేశంలో నిరుద్యోగం పెరిగిందని, ప్రజల ఆకలి బాధలు పెరిగాయని, దేశం దివాలా దిశగా వెళుతోందని, ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఆ పార్టీకి ఊడిగం చేస్తున్న వైసిపి తెలుగుదేశం, జనసేన పార్టీలను ఓడించి ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతిపాలు అయిందన్నారు. మోడీకి ప్రయోజనం చేకూర్చే విధంగానే చంద్రబాబు, జగన్ వ్యవహరిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

విశాఖ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పి.సత్యారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం పూర్తి కావడానికి ఇండియా ఫోరమ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిహెచ్.రాఘవేంద్రరావు, సిపిఐ విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు ఎం.పైడిరాజు, బి.వెంకటరమణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.పద్మ, ఆమ్ ఆద్మీ నాయకులు సీతల్ మదన్, సిఎంఎస్ నాయకులు లలిత, కాంగ్రెస్ నాయకులు సోడిదాసు సుధాకర్, రమణబాబు, కార్మిక యూనియన్ల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఓకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సిపిఐ అభ్యర్థి విమల

ముఖ్యమంత్రి జగన్ బస్‌యాత్ర దృశ్యాలు

బస్‌యాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న సిఎం జగన్

ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర శనివారం అనకాపల్లి జిల్లాలో కొనసాగింది. పాయకరావుపేట నియోజకవర్గంలోని గొడిచర్ల నుంచి ప్రారంభమైన ఈ బస్సు యాత్ర ఉద్దండపురం, కాగిత, సీతపాలెం, నక్కపల్లి, పులపర్తి, రేగుపాలెం, యలమంచిలి (బైపాస్) మీదుగా నర్సింగబిల్లికి చేరుకుంది. అక్కడ సభ అనంతరం తాళ్ల పాలెం జంక్షన్, జమదులపాలెం, బుచ్చెయ్య పేట, కశింకోట, కొత్తూరు, అనకాపల్లి, శంకరం, రేబాక, మర్రిపాలెం టోల్, దేవీపురం, గాలి భీమవరంల్లో సాగింది. చిన్నయ్యపాలెంలోని టెర్రకాన్ రాయల్‌లో సిఎం జగన్ బస చేశారు.

వికలాంగుడిని అక్కున చేర్చుకుని భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి

చిన్నారితో ముచ్చటలాడుతున్న జగన్

అవ్వలను ఆత్మీయంగా పలకరిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి

పెందుర్తి కాంగ్రెస్ అభ్యర్థి భగత్ నామినేషన్

కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న పిరిడి భగత్

ప్రజాశక్తి-పెందుర్తి: పెందుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇండియా ఫోరం తరుపున పోటీచేస్తున్న పిరిడి భగత్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. 93వ వార్డు పరిధి బాలాజీ గార్డెన్‌లోని తన నివాసం నుంచి భారీ ర్యాలీగా పెందుర్తి చేరుకున్నారు. నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి శేషశైలజకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన నివాసం వద్ద ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. పెందుర్తి బరిలో ఉన్న ఎన్‌డిఎ కూటమి, వైసిపి అభ్యర్థులు అవినీతిలో కూరుకుపోయారని ఆరోపించారు. ప్రజలు ఆలోచించి తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేగి వెంకటేష్, గొంప గోవిందరాజు, బట్ట శంకరరావు, ముక్క రామనాయుడు, పైలపూడి రాంబాబు, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కండువా వేస్తున్న టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - మునగపాక

వైసీపీ కార్యకర్తలతో పాటుగా పలువురు యువకులు తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రి సాయి కృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి పెంటకోట విజయ్ ఆధ్వర్యాన తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం రాత్రి వీరికి పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రజలు విసిగి వేసారి పోయారన్నారు. అభివద్ధి పేరుతో జగన్ రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శించారు. రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి దాడి ముసలి నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, కూటమి నాయకులు సీఎం రిత్విక్, దొడ్డి శ్రీనివాసరావు, దాడి శివ, పెంటకోట శ్రీరామ్మూర్తి, దాడి అప్పలనాయుడు, డొక్కా నాగభూషణం, బి. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వియ్యపు చిన్నను సత్కరిస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా వియ్యపు చిన్నా జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పరవాడ

తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పరావాడ, రావాడ పంచాయతీ శివారు గ్రామాల్లో ప్రజలు, యువత మహిళలు హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్య అతిథులుగా మాజీ జెడ్పీటిసి పైలా జగన్నాథరావు, మాజీ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు, పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు వచ్చి పూలమాలు, శాలువాతో సత్కరించి, కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో తానాం సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ, గొర్లివానిపాలెం మాజీ సర్పంచ్ గొర్లి కనకారావు, నాయుడుపాలెం ఎంపిటిసి కూండ్రపు శ్రీరామ్మూర్తి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ఇందల కొండలరావు, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు పైలా వరలక్ష్మి, సారిపల్లి జోగినాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, టిడిపి, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్ని మాపక వారోత్సవాలు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని అగ్ని మాపక వారోత్సవాల ముగింపు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజలు స్వయం సహాయక బృందాల మహిళలతో మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జి.వి.సత్యరాజు మాట్లాడుతూ అగ్నిమాపక పరికరాలు, వాటి ఉపయోగాలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కె.రాజారావు, కె.యల్లాజీ, ఎం శ్యామ్ కుమార్, వి.ద్వారకాద్రి , యం.సత్తిబాబు, సిహెచ్.బెనహర్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలు శనివారం అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, టిడిపి అనకాపల్లి పట్టణ అధ్యక్షులు కేకేవిఏ నారాయణ రావు తదితరులు కేక్ కట్ చేశారు. అనంతరం ఎన్టీఆర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు పుచ్చకాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సీఎం రిత్విక్, కొట్నీ బాలాజీ, కొణతాల బాలసుబ్రమణ్యం, కొణతాల వెంకట్రావు, ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, కుప్పిలి జగన్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట మండలం, కన్నూరుపాలెం గ్రామంలో జరిగిన చంద్రబాబు జన్మదిన వేడుకల్లో మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై టీడీపీ శ్రేణులతో కలసి కేక్ కట్ కార్యకర్తలకు తినిపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మళ్ళ సురేంద్ర, కాయల మురళి, మాజీ సర్పంచ్ కన్నూరు అక్కయ్యమ్మ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు శనివారం అచ్యుతాపురం టిడిపి పార్టీ కార్యాలయంలో ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను ఆయన కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జనపరెడ్డి నర్సింగ్‌రావు, నాయకులు దాడి ముసలి నాయుడు, ధూళి రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్లను కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నక్కపల్లి : నక్కపల్లిలో క్రిష్ టౌన్షిప్‌లో పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత స్వగృహంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు కార్యకర్తల సమక్షంలో అనిత కేక్ కట్ చేసారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక పార్టీ కార్యాలయంలో చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రయోజనాల కోసం నిరంతరం తపన పడే వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. టిడిపి జివిఎంసి మూడో వార్డు కమిటీ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చరకల రమణ, మారోజు సత్యవరప్రసాద్, గండిబోయిన పోలిరాజు, వి.సత్యారావు, కొక్కిరి అప్పన్న, వియ్యపు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : జివిఎంసి ఒకటో జోన్ తెలుగు యువత అధ్యక్షులు గరే సదానంద ఆధ్వర్యాన చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఎన్‌టిఆర్ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డు బాలాజీనగర్‌లో వార్డు టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు ముగడ రాజారావు, పేపర్ నాయుడు ఆధ్వర్యాన కేక్ కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు మూది అప్పారావు, ఆదినారాయణ రాజు, కాలేషా, లింగం సత్యనారాయణ రేఖా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : వచ్చే పుట్టిన రోజుకు చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూస్తామని టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో చంద్రబాబు 74 వ జన్మదిన వేడుకలు జరిగాయి. టిడిపి విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీ భరత్, పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని, కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ 74ఏళ్ల వయసులో కూడా చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి, ప్రజల శ్రేయస్సును కాంక్షిస్తూ, మంచి విజన్‌తో ఉత్తేజంగా పనిచేస్తున్నారన్నారు. చంద్రబాబు పోరాటానికి మనమందరం అండగా నిలవాలని పిలుపునిచ్చారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శులు లొడగల కృష్ణ, పుచ్చా విజయకుమార్, లీగల్ సెల్ అధ్యక్షులు బత్తి రాజశేఖర్ సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు.

వెలగపూడి క్యాంపు కార్యాలయంలో ...

ఎంవిపి కాలనీ : తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి క్యాంపు కార్యాలయంలో మాజీ సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు, రాష్ట్ర కార్యదర్శి పట్టాభిరామ్, జోన్ -1 కోఆర్డినేటర్ పోతనరెడ్డి, పలువురు వార్డు అధ్యక్షులు,టిడిపి శ్రేణులు పాల్గొన్నారు

కేక్ కట్ చేస్తున్న టిడిపి తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి

సిద్ధం సభకు తరలివెళ్లిన వైసిపి నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కసింకోట మండలంలో శనివారం నిర్వహించిన సిద్ధం సభకు అనకాపల్లి 82వ డివిజన్ కార్పొరేటర్ మందపాటి సునీత, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు ఆధ్వర్యంలో పలువురు వైసిపి నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పలక సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి గైపురి రాజు తదితరులు పాల్గొన్నారు.

బస్సులో వెళ్లడానికి సిద్ధమైన వైసిపి శ్రేణులు

బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల నుండి వైసీపీ నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిద్ధం బహిరంగ సభకు శనివారం తరలి వెళ్లారు. బస్సుల్లోనూ, ద్విచక్ర వాహనాల్లో బయలుదేరి వెళ్లారు.

స్తంభించిన ట్రాఫిక్

- బారులు తీరిన వాహనాలు

ప్రజాశక్తి- అచ్యుతాపురం : కసింకోట మండలంలో ముఖ్యమంత్రి సిద్ధం సభ కారణంగా ట్రాఫిక్‌ను ఎలమంచిలి నుంచి అచ్యుతాపురం మీదుగా మళ్లించడంతో అచ్యుతాపురంలో ఎలమంచిలి, గాజువాక, అనకాపల్లి, పూడిమడక మార్గాల్లో శనివారం వాహనాలు స్తంభించాయి. గాజువాక నుంచి పరవాడ అచ్చుతాపురం మీదుగా ఎలమంచిలి వైపు వాహనాలను తరలించారు. రహదారి వెడల్పు చిన్నది కావడంతో భారీ వాహనాలు రాకపోకలతో ట్రాఫిక్ స్తంభించింది. భారీ వాహనాలు కదలడానికి వీలు లేకుండా సమస్య ఏర్పడింది. గంటల తరబడి వాహనాలు కదలకుండా నిలిచి పోయాయి. ఎస్ఇజెడ్‌లో పనిచేసే కార్మికులు విధులు ముగించుకొని వారి స్వగ్రామాలకు వెళ్లడానికి చాలా ఆలస్యమైంది. పోలీసులు వాహనాలను కంట్రోల్ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. అనేకమంది పలు ఇబ్బందులకు గురయ్యారు.

ఉచిత కేన్సర్ వైద్య శిబిరం

ప్రజాశక్తి -మునగపాక

మండలంలోని నాగులపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వద్ద హోమీ బాబా కేన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యాన శనివారం ఉచిత కేన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది 30 ఏళ్లు పైబడిన వారికి కేన్సర్ స్క్రీనింగ్ చేసి, క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తరుణ్ సునీత, పి.ఆదర్శకుమార్, పల్లవి, రాధ, కృష్ణంరాజు, మెడికల్ ఆఫీసర్ ప్రవల్లిక, పీహెచ్ఎన్ అనురాధ, సిహెచ్ఓఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఆర్థిక సాయం అందజేస్తున్న బంగారుతల్లి సమితి సభ్యులు

కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని ఇరువాడ పంచాయతీ శివారు గణపతి నగర్ గ్రామానికి చెందిన మామిడి సంజీవరావు లక్ష్మీ దంపతుల పుత్రిక మామిడి హేమంత కుమారి(13) కేన్సర్ బారిన పడడంతో, ఆమె వైద్యం నిమిత్తం మండలంలోని సబ్బవరం జోడుగుళ్ల కు చెందిన శ్రీబంగారు తల్లి సేవా సమితి వారు రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని శనివారం కుమారి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలిక తల్లిదండ్రులు వృత్తిరీత్యా టిఫిన్ సెంటర్ నడుపుతున్నారని, ఎవరైనా దాతలు ఉంటే ముందుకు వచ్చి క్యాన్సర్ బాధిత బాలికను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బంగారుతల్లి సేవా సమితి అధ్యక్షులు సింగంపల్లి వెంకటరావు, సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్లు ఇంటి వద్దే అందజేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

మండే వేసవికాలాన్ని దష్టిలో పెట్టుకొని మే, జూన్ నెలల్లో ప్రభుత్వ సామాజిక ఫించన్లను లబ్ధిదారులకు వారి ఇంటి వద్దనే అందించాలని సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్లా నాగభూషణం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎలక్షన్ కోడ్ కారణంగా ప్రభుత్వం ప్రతి నెలా ఫించన్ లబ్ధిదారులకు ఇచ్చే సామాజిక ఫించన్‌లను గ్రామ సచివాలయాల్లో ఇవ్వాలని ఆదేశాలు ఉన్న కారణంగా ఏప్రిల్ నెలలో ఎండ కారణంగా లబ్ధిదారులు ఇబ్బంది పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండ వేడిమి తట్టుకోలేక, పడిగాపులు కారణంగా సుమారు 36 మంది వరకు ఫించన్ లబ్ధిదారులు మరణించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం గాకుండా ప్రభుత్వం రాష్ట్రంలో 65 లక్షల ఫించన్ లబ్ధిదారులకు వారి ఇంటి వద్దే పింఛన్లు ఇవ్వాలని, దానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు.

ఉత్సాహంగా జగన్ బస్‌యాత్ర

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో జగన్ బస్సు యాత్ర ఉత్సాహంగా కొనసాగింది.గొడిచెర్ల నైట్ స్టే పాయింట్ నుంచి శనివారం ఉదయం సీఎం జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్ర ప్రారంభమైంది. సీఎం జగన్ మోహన్ రెడ్డి 9 గంటలకు బయలు దేరతారన్న సమాచారంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు గొడిచెర్ల, చినదొడ్డిగల్లు, నక్కపల్లి హైవే జంక్షన్ వద్దకు చేరుకున్నారు. 10.30 గంటలకు సీఎం జగన్ బస్సు యాత్ర ప్రారంభించారు. గొడిచెర్ల, ఉద్దండపురం, వేంపాడు, చినదొడ్డిగల్లు, కాగిత, నక్కపల్లి మీదుగా బస్సు యాత్ర సాగింది.గొడిచెర్ల, నక్కపల్లి హైవే జంక్షన్ల వద్ద అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి ముత్యాల నాయుడు, పాయకరావుపేట నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థి కంబాల జోగులు, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణలతో కలిసి జగన్ బస్సు యాత్రను కొనసాగించారు.

వాహనదారులకు తప్పని అవస్థలు

ప్రజలకు నమస్కరిస్తున్న సిఎం జగన్

సీఎం జగన్ రాకతో పోలీసులు సుమారుగా గంట సేపు వాహనాలను నిలుపుదల చేశారు. దీంతో వాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. గొడిచెర్ల వద్ద సీఎం నైట్ స్టే పాయింట్ ఏర్పాటు చేయడంతో రాకపోకలకు పోలీసులు ఆంక్షలు పెట్టడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు.గొడిచెర్ల వద్ద సీఎం నైట్ స్టే పాయింట్ కు వెళ్లే మార్గంలో గోతులను మట్టితో పూడ్చారు. జగన్‌ను పాయకరావుపేట, యలమంచిలి, అనకాపల్లి, నర్సీపట్నం, మాడుగుల, చోడవరం నియోజకవర్గాలకు చెందిన పలువురు వైసిపి నేతలు కలిశారు.

ఎస్.రాయవరం: మండలంలోని అడ్డురోడ్డులో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బస్ యాత్రను చేపట్టారు. ప్రజలకు అభివాదం చేస్తూ యాత్రను కొనసాగించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఎంపి అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు, రాజ్యసభ సభ్యుడు గొల్లబాబూరావు సిఎం వెంట ఉన్నారు.

తరలి వెళ్లిన వైసిపి శ్రేణులు..

కోటవురట్ల:సీఎం జగన్ మోహన్ రెడ్డి సిద్ధం బహిరంగ సభకు మండలం నుంచి వైసీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ప్రతి గ్రామం నుంచి బస్సులపై బయలుదేరి వెళ్లారు. మండల వైసీపీ అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు, జిల్లా యువజన విభాగపు కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసరావు పెద్ద సంఖ్యలో శ్రేణులను సభకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేస్తున్నారని తెలిపారు.

ప్రచారం చేపడుతున్న పైలా ప్రసాదరావు, కుటుంబీకులు

గ్రామాల్లో పైలా ప్రచారం

ప్రజాశక్తి -చీడికాడ: మండలంలోని బి.సింగవరం, లక్ష్మీనారాయణపురం గ్రామాలలో శుక్రవారం రాత్రి ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా టిడిపి-బిజెపి-జనసేన పార్టీల మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు, ఆయన సతీమణి శ్రీదేవి ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షుడు శరగడం శివ, పాల సంఘం అధ్యక్షుడు శరగడం రవి, నాయకులు దాడి సోమినాయుడు, దాడి కళ్యాణం, రాపేటి తరుణ్, చప్ప శ్రీను, శరగడం సత్తిబాబు పాల్గొన్నారు.

కళ్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ఘనంగా శివపార్వతుల కళ్యాణం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక (లక్ష్మణేశ్వరస్వామి దేవస్థానం) శివాలయంలో శివ, పార్వతుల కళ్యాణం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణతో శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు మహేష్, వేద పండితులు భగవాన్ శర్మ, పండు శర్మ ల నేతృత్వంలో కళ్యాణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న స్క్వాడ్ డిఎఫ్ఓ

కలప స్వాధీనం

ప్రజాశక్తి-గొలుగొండ:పాతకృష్ణదేవి పేటలో కార్పెంటర్ ఇంటి సమీపంలో అడపా శ్రీనుకు చెందిన టేకు, గన్నర పది దుంగలను పట్టుకున్నారు. కలప నిల్వ ఉంచారనే అందిన ఫిర్యాదు మేరకు స్క్వాడ్ డీఎఫ్ఓ సోమ సుందరం శనివారం తనిఖీలు చేపట్టారు. కలప రవాణాపై ప్రత్యేక దృష్టిసారించామని ఆయన తెలిపారు.

బురద రోడ్డుతో ఇక్కట్లు

-ఇబ్బంది పడిన వాహనదారులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలో శనివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపుల శబ్దాలతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షం కారణంగా అరకు- పాడేరు ప్రధాన రహదారి నారింజ వలసలో నిర్మిస్తున్న 516ఇ హైవే రోడ్డుపై ఉన్న మట్టి కూరుకు పోవడంతో బురద మయంగా మరింది. దీంతో, ఆ రోడ్డుపై వెళ్ళే న్న వాహనాలు జారి పోవడటంతో ఇబ్బంది పడ్డారు.

కూరుకుపోయిన బస్‌లు

సిఎం సభకు ఆర్‌టిసి బస్సుల తరలింపుతో..

ప్రయాణికులకు తీవ్ర ఇక్కట్లు

-ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి- అనకాపల్లిడెస్క్: రాజయకీయ పార్టీల సభలకు ఆర్టీసీ బస్సులను ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు అన్నారు. నర్సీపట్నంలో శనివారం ఆయన మాట్లాడుతూ, శనివారం అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలలో ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ్డి సభలకు ఆర్టీసీ బస్సులను మళ్లించారని, దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వేలాది మంది ప్రయాణికులు, చంటి పిల్లలు, వృద్ధులు, విద్యార్థులు మండుటెండలలో తీవ్ర అవస్థలు పడ్డారన్నారు. రాజకీయ పార్టీల సభలకు ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రజా రవాణా సంస్థకు ప్రజలు ప్రయాణం ముఖ్యమా! అదికార పార్టీ సభలు ముఖ్యమా? అని ప్రశ్నించారు. దీనిపై డ డిమాండ్ చేశారు. ఇక నుండి రాజయకీయ పార్టీల సభలకు ఆర్టీసీ బస్సులను ఇవ్వడాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈరెల్లి చిరంజీవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత రాజు

పండగకు ఆటంకాలు సరికాదు

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నంలో మరిడి మహాలక్ష్మి అమ్మవారి పండగకు ఆటంకాలు సృష్టించడానికి ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ, 2022 సంవత్సరంలో మరిడమ్మ పండగకు ఎమ్మెల్యే ఇబ్బందులు పెట్టారని గుర్తు చేశారు. మరిడమ్మ నగల విషయంలో తాము ప్రవేశించేంత వరకు బయట పెట్టలేదని విమర్శించారు. ఆభరణాలు ఏమైనా తక్కువైతే మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణదే బాధ్యత అన్నారు.

మాట్లాడుతున్న విజయ్

కనీస సౌకర్యాలు లేక అవస్థలు

-విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కరువు

-ఇదీ ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ దుస్థితి

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో నిర్మించిన ఆయుష్మాన్ భారత్ వెల్నెస్ సెంటర్‌కు కనీస వసతులు లేక పోవడంతో సెంటర్లో పనిచేసే సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. ఈ కేంద్రాన్ని 12వ నెలలో ఎమ్మెల్యే గొల్ల బాబురావు ప్రారంభించారు. ఈ భవనానికి నేటికీ విద్యుత్, నీటి సౌకర్యం లేవు. కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. వెల్నెస్ సెంటరులో మరుగుదొడ్ల నిర్మాణం లేకపోవడం విశేషం. ఈ సెంటర్లో వైద్య ఆరోగ్య సిబ్బంది దాదాపు 6మంది వరకు మహిళలు పని చేస్తున్నారు.నేటికీ కూడా కార్యాలయానికి విద్యుత్ సౌకర్యం కల్పించ లేదు.అధికారులు ఇప్పటికైనా స్పందించి కార్యాలయానికి విద్యుత్ సౌకర్యం నీటి సౌకర్యం కల్పించాలని సిబ్బంది కోరుకుంటున్నారు.

ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్

పార్టీలోకి ఆహ్వానిస్తున్న అనిత

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో గుల్లిపాడు శివారు జనకయ్యపేట చెందిన పలువురు టిడిపిలో చేరారు .నక్కపల్లిలో క్రిష్ టౌన్ షిప్ నందు పాయకరావుపేట నియోజకవర్గం అసెంబ్లీ కూటమి అభ్యర్థి వంగలపూడి అనిత శనివారం పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు .

నిబంధనల మేరకే కార్యక్రమాలు

-మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మరిడి మహాలక్ష్మీ అమ్మవారి జాతరకు సంబంధించి సాంస్కృతిక కార్యక్రమాల సమయాలను మార్పు చేస్తున్నామని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. శనివారం ఆయన నర్సీపట్నంలో మాట్లాడుతూ ఈ నెల 22న పెద్ద జాగారం, 23న పండుగ నిర్వహిస్తున్నామన్నారు. రాత్రి 10 గంటల తర్వాత ఎటువంటి కార్యక్రమాలు చేయకూడదని నిబంధనలు ఉన్నాయన్నారు. దీంతో, రాత్రి 7 గంటల నుంచి 10 గంటల లోపే స్టేజ్ ప్రోగ్రాం నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

డోలీ మోతతో గిరిజనుల అవస్థలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మారుమూల గిరిజన గ్రామాల్లో సరైన రోడ్డు సౌకర్యం లేక గర్భిణీలకు ప్రసవ సమయంలో డోలి మోతలు కష్టాలు తప్పడం లేదు. మండలంలోని మారుమూల ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు కొల్లాపుట్టు పంచాయతీ బొడ్డమామిడి గ్రామానికి చెందిన పొట్టంగి సన్యాసమ్మ అనే గర్భిణి మహిళకు శనివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108 అంబులెన్స్ కు సమాచారం అందించారు. ఆ గ్రామానికి నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో సుమారు మూడు కిలోమీటర్లు దూరం మోసుకుని తీసుకెళ్లి అక్కడి నుంచి అంబులెన్స్ లో అరకులో ఏరియా హాస్పిటల్‌కు గర్భిణిని తరలించారు. ఇటువంటి సంఘటనలు గిరిజన ప్రాంతంలో జరుగుతున్న ప్రభుత్వం, అధికారులు గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించడంలో నిర్లక్ష్యం వహించడం విచారకరం.

మధురవాడలో ఫైర్‌స్టేషన్ అవసరం

నినాదాలు చేస్తున్న కార్మికులు

ఐకమత్యంతో ముందుకెళ్తాం

గంగవరం పోర్టు కార్మికులు

ప్రజాశక్తి- గాజువాక : కార్మికుల మధ్య ఐక్యతను దెబ్బతీయడానికి అదాని గంగవరం పోర్టు యాజమాన్యం ప్రయత్నిస్తోందని, తామంతా ఐకమత్యంగానే పోరాటంలో ముందుకెళ్తామని కార్మికులు స్పష్టంచేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ గంగవరం ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన పోర్టు ప్రధాన గేటు వద్ద చేపట్టిన ఆందోళన శనివారం నాటికి 11వ రోజుకు చేరుకుంది. శనివారం భారీ ఎత్తున కార్మికులు గేటు వద్ద కూర్చొని యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు.

నాగమణి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పద్మనాభం, కృష్ణాపురం, ఇసుకలపాలెం గ్రామాల్లో భీమిలి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి నాగోతి నాగమణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి స్థానికురాలినైన తనకు ఒక అవకాశం ఇప్పించాలని విజ్ఞప్తిచేశారు.

న్యూ డెమోక్రసీ అభ్యర్థి నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అభ్యర్థి పల్లాల లచ్చిరెడ్డి శనివారం నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో రంపచోడవరం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్‌కు ఒక సెట్ నామినేషన్ పత్రాన్ని లచ్చిరెడ్డి అందజేశారు.

అగ్నిప్రమాదాల నివారణపై సివిల్ ఫైర్‌ఫైటర్స్‌కు శిక్షణ
వారోత్సవాల ముగింపులో ఆర్‌ఎఫ్‌ఒ నిరంజన్ రెడ్డి

వారోత్సవాల ముగింపులో మాట్లాడుతున్న ఆర్‌ఎఫ్‌ఒ నిరంజన్‌రెడ్డి

ప్రజాశక్తి- యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : భౌగోళికంగా, జనాభాపరంగా విస్తరించిన విశాఖ నగరంలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించి అగ్ని ప్రమాద స్థలాలకు సకాలంలో చేరుకోవడం, మంటలను అదుపుచేయడం ఫైర్‌సిబ్బందికి కత్తిమీద సాములా మారిందని, ఈ నేపథ్యంలో మధురవాడ ప్రాంతంలో మరొక ఫైర్ స్టేషన్ ఏర్పాటు అవసరం ఉందని ఆర్‌ఎఫ్‌ఒ డి.నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం.అగ్నిమాపక -రోత్సవాల ముగింపు సందర్భంగా సూర్యాబాగ్ ఫైర్ స్టేషన్‌లో వివిధ వ్యాపార సంస్థలు, షాపింగ్ మాల్స్, హోటల్స్ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఎటువంటి ఫైర్ ఎక్విప్మెంట్ లేకుండా అగ్నిప్రమాదాలను అరికట్టడం, నివారించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సివిల్ ఫైర్ ఫైటర్స్‌కు మూడు రోజులపాటు శిక్షణనిచ్చి, సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా, ప్రమాదస్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకునేలోపే, ఆస్థి, ప్రాణనష్టాన్ని వీలైనంత వరకు తగ్గించి, మంటలను అదుపు చేయడంపై వీరికి తర్ఫీదునిస్తా మన్నారు. సమావేశంలో డిఎఫ్‌ఒ ఎస్.రేణుకయ్య, ఎడిఎఫ్‌ఒలు పి. సింహాచలం, ఎన్. గోపి పాల్గొన్నారు..

తగరపువలస : చిట్టివలస అగ్నిమాపక శాఖ ఆధ్వర్యాన ఈ నెల 14న ప్రారంభమైన అగ్ని మాపక వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. చిట్టివలస అగ్ని మాపక శాఖ అధికారి జి శ్రీనివాసరాజు అధ్యక్షతన అగ్నిమాపక కేంద్రం వద్ద శనివారం జరిగిన ముగింపు సభలో భీమిలి మండలం చిప్పాడ దివీస్ సంస్థ సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, భద్రతా అధికారి ఎం.చంద్రశేఖర్, శ్రీమణికంఠ స్వీట్స్ అండ్ బ్యాకరీ యాజమాన్య ప్రతినిధి ఎ.నాగరాజు పాల్గొన్నారు. అగ్ని మాపక శాఖ అందిస్తున్న సేవలను కొనియాడారు. ముగింపు సభకు హాజరైన అతిథులను ఫైర్ ఆఫీసర్, సిబ్బంది సత్కరించారు. అనంతరం అగ్ని మాపక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వివిధ పరికరాల ప్రదర్శనను తిలకించారు.

'ఎల్‌విపి'లో అవుట్ పేషెంట్ విభాగం ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రిలోని జిఎంఆర్ వరలక్ష్మి ప్రాంగణంలో అవుట్ పేషెంట్ విభాగాన్ని లారస్ ల్యాబ్ లిమిటెడ్ సౌజన్యంతో శనివారం ప్రారంభించారు. లారస్ ల్యాబ్స్ సిఇఒ డాక్టర్ సత్యనారాయణ చావా, ఇడి రవి కుమార్ వివి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ విభాగంలో 20 మంది అవుట్ పేషెంట్లకు సదుపాయం ఉండేలా 12 పరీక్షా గదులు ఏర్పాటు చేశారు. అదనంగా ప్రత్యేకమైన ఆప్తాల్మిక్ డయాగ్నస్టిక్స్, సుమారు 100 మంది వేచి ఉండేందుకు సువిశాలమైన హాల్ ఉందని ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి క్యాంపస్ అధిపతి డాక్టర్ వీరేందర్ సచ్ దేవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెటీనా విభాగధిపతి డాక్టర్ అవినాష్ పతంగే, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవుట్ పేషెంట్ విభాగాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సత్యనారాయణ

వ్యర్థాలతో చేపల పెంపకాన్ని నివారించాలి

వ్యర్థాలను చూపుతున్న సిపిఎం నేత వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని అక్రమంగా చేపలు చెరువులు నిర్వహిస్తున్న వారు మాంసం, కంపెనీల క్యాంటీన్ల వ్యర్థాలతో చేపలు పెంపకం చేయడాన్ని అధికారులు నివారించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని కొత్తపెంట, ములకాలపల్లి, మామిడిపల్లి, కలిగోట్ల, మారేపల్లి, చేనులపాలెం, దేవరాపల్లి, పెదనందిపల్లి, తారువ తదితర గ్రామాల్లో వెంకన్న పర్యటించి అక్రమంగా నిర్వహిస్తున్న చేపలు చెరువులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవరాపల్లి మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా దాదాపుగా వెయ్యి ఎకారాల్లో అక్రమంగా చేపల చెరువులను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ చేపలకు చనిపోయిన పశువులు, గొర్రెలు, మేకల మాంసం, చికెన్ వ్యర్థాలను, బ్రాండిక్స్ వంటి కంపెనీల క్యాంటీన్‌లో వ్యర్థాలను తీసుకొచ్చి మేతగా వేస్తున్నారని పేర్కొన్నారు. దీని వల్ల ఈ చేపలు తినే వారికి తీవ్రమైన రోగాలు, కేన్సర్ వంటి భయంకర వ్యాధులు వస్తున్నాయన్నారు. వీటిపై ఏ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఫిబ్రవరి 26న కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే, మత్స్యశాఖ అధికారులు చేపల పెంపకందారులకు నోటీసులు ఇచ్చి, వారి దగ్గర మామూళ్లు తీసుకొని చేతులు దులుపుకున్నారని విమర్శించారు. దీంతో అక్రమ చేపలు పెంపకందారులు మరింతగా బరితెగించి వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాంసం వ్యర్థాలు, కంపెనీల్లోని క్యాంటీన్ల వ్యర్థాలను చేపలు పెంపకానికి మేతగా వేయకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణాలు కాపాడాలని వెంకన్న డిమాండ్ చేశారు.

ప్రచారంలో పాల్గొన్న సుందరపు, ప్రగడ తదితరులు

జనసేన అభ్యర్థి సుందరపు ప్రచారం

ప్రజాశక్తి -మునగపాక

మండలంలోని రాజుపేట, కాకరపల్లి, నారాయుడుపాలెం, పాటిపల్లి గ్రామాలలో ఎలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ సుందరపు విజయ్ కుమార్ శనివారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలలోని ప్రతి గడపకు వెళ్లి గాజు గ్లాసు, కమలం పువ్వు గుర్తులను ప్రజలకు అందిస్తూ వచ్చే ఎన్నికలలో తమకు ఓట్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు టెక్కలి పరశురాం, దొడ్డి శ్రీనివాసరావు, ఏవి సత్యనారాయణ, కాళ్ళ చంద్రమోహన్, మొల్లేటి ఆనంద్, భీమరశెట్టి శ్రీనివాసరావు, మొల్లేటి సరళ, సత్యనారాయణ, ఆడారి జానకి, ఆడారి మంజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ ఏడాది వేసవి సీజన్‌లో

రికార్డు స్థాయిలో ప్రత్యేక అదనపు రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ

ప్రయాణీకుల సౌకర్యార్థం ఈ ఏడాది వేసవి కాలంలో భారతీయ రైల్వేలు రికార్డు స్థాయిలో 9111 ట్రిప్పులను నడుపుతోందని రైల్వేశాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి శనివారం ప్రకటనలో తెలిపారు. గతేడాదితో పోలిస్తే 2742 ట్రిప్పులు అదనంగా నడుపుతున్నామన్నారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో 52 వేసవి ప్రత్యేక రైళ్లతో పాటు 12జతల అదనపు రైళ్లను నడపడానికి సన్నద్ధమైందన్నారు. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా రైళ్ల సంఖ్య , ట్రిప్పుల సంఖ్యను పెంచుతామన్నారు.

ఇదిలావుండగా అన్ని రైల్వే స్టేషన్లలో తాగునీటి లభ్యత ఉండేలా చర్యలు చేపట్టాలని డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ ఆదేశించారు. అన్ని ప్రధాన ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో విస్తృతమైన ప్రయాణికుల రద్దీ నియంత్రణ, పర్యవేక్షణకు సీనియర్ అధికారులను ఆయా స్టేషన్లలో అందుబాటులో ఉంచామన్నారు. ప్రయాణీకులకు రియల్ టైమ్ సాయం చేసేందుకు నైపుణ్యత కలిగిన ఆర్‌పిఎఫ్ సిబ్బంది నిర్వహణలో సిసి టివి కంట్రోల్ రూమ్‌ఏర్పాటు చేశామన్నారు.

అప్పలనర్సను గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి-సీలేరు : సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పి.అప్పలనర్సను గెలిపించాలని కోరుతూ జీకే.వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధి నరమామిడి, కొంది గ్రామాల్లో శనివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం సభ్యులు పి.నాగేశ్వరరావు, పి.రాము, కే.బలరాం, రామకృష్ణ, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : ఇండియా కూటమి బలపరిచిన అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పి.అప్పలనర్సకు ఓటేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని గుంటసీమ పంచాయతీలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు, మాజీ సర్పంచ్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజనుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న సిపిఎం అభ్యర్థులను ఆదరించి చట్టసభలకు పంపించాలన్నారు.

విద్యా హక్కు చట్టం కింద ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో నూతన విద్య హక్కు చట్టం ద్వారా వివిధ విద్యా సంస్థల్లో 25 శాతం సీట్లలో ఒకటవ తరగతిలో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 300 విద్యాసంస్థల్లో ఐచ్ఛికంగా 2980 మంది విద్యార్థులు ముందుకు వచ్చారన్నారు. విద్యార్థులకు మూడు రౌండ్ల లాటరీ రిజల్ట్స్ ద్వారా కల్పించడం జరుగుతుందని చెప్పారు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం మే 23న ప్రవేశాలు నిర్ధారించడం జరుగుతుందన్నారు.